'చలో నల్లగొండ' సభకు తరలిరావాలి

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్

ఆత్మకూరు(ఎం) : సభ పోస్టర్లను విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి12 : కృష్ణానది జలాల్లో రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం నేడు నల్లగొండలో జరుగనున్న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో 'చలో నల్లగొండ' ప్రచార పోస్టర్లను విడుదల చేసి మాట్లాడుతూ.. సభకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరుకానున్నందున పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం నింపిందన్నారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి మాజీ మండల కో ఆర్డినేటర్ యాస ఇంద్రారెడ్డి, జిల్లా డైరెక్టర్ కోరె భిక్షపతి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గడ్డం దశరథ గౌడ్, బీఆర్ఎస్ మండల సెక్రటరీ జనరల్ మామిడి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు కోరె వెంకన్న, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు అజీమొద్దీన్, పోతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ యయాతిరాజు, మల్లయ్య పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : కృష్ణా జలాల నిర్వహణను కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ నల్లగొండలో నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభకు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పార్టీ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. సభకు మాజీ సీఎం కేసీఆర్ హాజరవుతున్నారని, రాష్ట్ర ప్రజల హక్కుల సాధన కోసం దండులా కదలాలని కోరారు.

సభను విజయవంతం చేయాలి

ఆలేరు : నేడు నల్గొండలో జరిగే కేసీఆర్ సభకు బీఆర్ఎస్ నాయకులు భారీ ఎత్తున వచ్చిన సభను విజయవంతం చేయాలని జిల్లా ఆర్టీఏ సభ్యుడు పంతం కృష్ణ కోరారు. సోమవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, ఇంతకుముందు లాగే పార్టీ కోసం పని చేయాలని సూచించారు. సమావేశంలో ఆలేరు యూత్ పట్టణాధ్యక్షుడు పూల శ్రవణ్, వెంకటేశ్, భరత్, మహబూబ్ పాల్గొన్నారు.

మొబైల్ రైతు బజార్లను సద్వినియోగం చేసుకోవాలి

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి

మొబైల్ రైతుబజార్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 12 : మొబైల్ రైతుబజార్లను ప్రజలు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి కోరారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో మొబైల్ రైతుబజార్ వాహనానికి ఆయన రిబ్బన్ కట్ చేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళారుల ప్రమేయం లేకుండా రైతు నుంచి ప్రజల వద్దకు తీసుకొచ్చే మొబైల్ రైతు బజార్ సేవలను వినియోగించుకోవాలని, నాబార్డ్, వ్యవసాయ, ఉద్యానశాఖల సహకారంతో భువనగిరి రైతు ఉద్యానవన ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ వారు ఈ మొబైల్ రైతుబజార్లు నడపడం శుభపరిణామమన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, ఉద్యానవన అధికారి అన్నపూర్ణ, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, మొబైల్ రైతు బజార్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

భువనగిరి కలెక్టరేట్ : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు భాస్కర్‌రావు, వీరారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వారు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. మొత్తం 34 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి, ఆర్జీదారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ పోటీల్లో విజేతలు వీరే..

జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 12 : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా 'సుస్థిర భవిష్యత్ కోసం విజ్ఞాన శాస్త్రం' అనే అంశంపై జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈ నెల 9న చిత్రలేఖనం, కవితలు, పాటలు, ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు జి ల్లా సైన్స్ అధికారి భరణికుమార్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతి అంశం నుంచి ఉత్తమమైన 10 ప్రదర్శనలను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు చెప్పారు. సోమవారం స్థానిక బస్‌పన్ పాఠశాలలోజిల్లా స్థాయి పోటీలు నిర్వహించి మూడు ప్రదర్శనలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

చిత్రలేఖనంలో మొదటి బహుమతి జశస్వి, బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ భువనగిరి, రెండో బహుమతి వైష్ణవి జడ్పీహెచ్ఎస్ చల్లూరు, మూడో బహుమతి కీర్తి జడ్పీహెచ్ఎస్ వెలువర్తి, కవితల విభాగంలో మొదటి బహుమతి సాకేత్ ఎంజేపీటీ అనంతారం, రెండో బహుమతి మెర్సీ జకర్యా హైస్కూల్ జాల, మూడో బహుమతి లక్ష్మీప్రసన్న జడ్పీహెచ్ఎస్ రాయగిరి, పాటల విభాగంలో శిరీష జడ్పీహెచ్ఎస్ బీఎన్ తిమ్మాపూర్, రెండో బహుమతి అజయ్ జడ్పీహెచ్ఎస్ దత్తాయిపల్లి, మూడో బహుమతి హిమబిందు కృష్ణవేణి హైస్కూల్ చౌటుప్పల్, ఉపన్యాసం విభాగంలో శ్రేయాస్ మదర్‌థెరిస్సా హైస్కూల్ భువనగిరి, రెండో బహుమతి వెంకటేశ్ ఎంజేపీటీ పోచంపల్లి, మూడో బహుమతి కరుణశ్రీ జడ్పీహెచ్ఎస్ గుండాల ఎంపికయ్యారు.

అడ్డగూడూరు సింగిల్‌విండో చైర్మన్‌పై అవిశ్వాసం

సింగిల్‌విండో కార్యాలయం నుంచి బయటకు వస్తున్న డైరెక్టర్లు

అడ్డగూడూరు, ఫిబ్రవరి 12 : అడ్డగూడూరు సింగిల్‌విండో చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లుపై అవిశ్వాసం పెట్టాలని గత నెల 22న డైరెక్టర్లు డీసీఓకు వినతిపత్రం అందజేశారు. ఆయన ఆదేశాను సారం సోమవారం జరిగిన అవిశ్వాస తీర్మానంలో 13 మంది డైరెక్టర్లు గానూ 10 మంది హాజరయ్యారు. చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, పోగుల నర్సిరెడ్డి, ఎల్లంల వీరస్వామి హాజరు కాలేదు. ఈ సందర్భంగా డీసీఓ పాల్వాయి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. హైకోర్టులో స్టే ఉన్నందున కోర్టు ఆదేశాల మేరకు ఫలితాన్ని కోర్టుకు సమర్పించినట్లు తెలిపారు. కోర్టు తీర్పు అనంతరం కోర్టు ఆదేశాల మేరకు నడుచుకోనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రామన్నపేట సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రామలింగేశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌కు సన్మానం

ఆత్మకూరు(ఎం) : ఆలయ కమిటీ చైర్మన్ ఐలయ్యను, డైరెక్టర్ శేఖర్‌ను సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి12 : మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన గుండెగాని ఐలయ్య గౌడ్, డైరెక్టర్ బూడిద శేఖర్‌గౌడ్‌ను సోమవారం గౌడసంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పంజాల నర్సయ్యగౌడ్, గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు బీసు చందర్‌గౌడ్, మండల నాయకులు దశరథగౌడ్, సత్యనారాయణ, నాతిరాజు, వెంకన్న, నాగరాజు, స్వామి, మల్లేశం, శ్రీను పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 12 : మండలంలోని కూరెళ్లలో అంబేద్కర్ యూత్ క్లబ్ అధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ప్రథమ బహుమతి అంబేద్కర్ యూత్ క్లబ్ కూరెళ్ల, ద్వితీయ బహుమతి దళిత యూత్ క్లబ్ మోత్కూర్ జట్లు గెలుపొందాయి. విజేతలకు మాజీ సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్వామిగౌడ్, పాపయ్య, రమేశ్, మత్స్యగిరి, అశోక్, మల్లారెడ్డి, సురేశ్, నరేశ్, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'బీబీనగర్ ఎయిమ్స్‌లో స్థానికులకే ఉద్యోగాలివ్వాలి'

బీబీనగర్, ఫిబ్రవరి 12 : బీబీనగర్ ఎయిమ్స్‌లో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరుతూ యువజన సంఘాల నాయకుడు పంజాల సురేశ్‌గౌడ్ అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో కలిసి అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక యువకులు ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్తున్నారని, ఎయిమ్స్‌లో ఉద్యోగం ఇస్తే ఇక్కడే ఉపాధి పొందుతారన్నారు.

ఆర్థిక సాయం

రాజాపేట, ఫిబ్రవరి 12 : మండలంలోని పారుపల్లికి చెందిన మోత్కుపల్లి మైసమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాపోలు లక్ష్మారెడ్డి సోమవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నీతాల వీరయ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

● ఎంపీఓ దినకర్

రాజాపేట, ఫిబ్రవరి 12 : ప్లాసిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఎంపీఓ దినకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఎన్‌సీసీ వలంటీర్లతో కలిసి ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆడెపు ఈశ్వరమ్మాశ్రీశైలం, మాజీ వార్డు సభ్యుడు ఎర్ర గోకుల జశ్వంత్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

21న లక్ష్మక్కపల్లిలో వనదేవతల జాతర

రాజాపేట, ఫిబ్రవరి 12 : మండలంలోని లక్ష్మక్కపల్లిలో ఈ నెల 21 నుంచి 24 వరకు వన దేవతలైన సమక్క, సారలమ్మ జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. జాతర కోసం వన దేవతల గద్దెలను ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తుల కోసం ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం : ఎస్ఎఫ్ఐ

బొమ్మలరామారం, ఫిబ్రవరి12 : రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లావుడ్యా రాజునాయక్ అన్నారు. బడ్జెట్‌లో విద్యకు తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. కేవలం7.8 శాతం నిధులతో విద్యారంగం ఎలా అభివృద్ధి చెందుతుందన్నారు. సంక్షేమ వసతి గృహాల మెస్ చార్జీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు గణేశ్, రాజశేఖర్, భరత్, జశ్వంత్, సంపత్, రాజేశ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి12 : మండలంలోని దేవలమ్మ నాగారంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీటీసీ సురుగు రాజమ్మ సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ వెంకట్‌రెడ్డి, సుధారెడ్డి, శ్రీనివాస్, నర్సింహ, మనోహర్, యాదిరెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మార్కండేశ్వర బ్రహ్మోత్సవాలు

భూదాన్‌పోచంపల్లి : స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీశ్రీనివాస్

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 12 : పట్టణ కేంద్రంలోని మార్కండేశ్వరస్వామి ఆలయ 47వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మార్కండేయ మహర్షి జన్మ దినోత్సవం, డోలారోహణం, లక్ష పుష్పార్చన నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై మార్కండేయుడిని ప్రతిష్ఠించి పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, ఆలయ చైర్మన్ బడుగు చండికేశ్వర్, తడక వెంకటేశం, తడక రమేశ్, సీత శ్రీరాములు, భోగ భానుమతీవిష్ణు, కస్తూరి సుదర్శన్, భోగ చంద్రశేఖర్, రుద్ర బాలరాజు, మంగళపల్లి రాజారమేశ్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని రాజాపేట, బేగంపేట, రఘునాథపురం గ్రామాల్లో భక్త మార్కండేయ జయంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు బోగ హరినాథ్, ఆడెపు శ్రీశైలం, కటకం వెంకటేశం, బింగి బాలరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్త మార్కండేయస్వామి జయంతి

మోత్కూరు : మండల, పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో స్థానిక మార్కండేయ స్వామి ఆలయంలో స్వామివారి జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు మహేశ్వరం వెంకటేశ్వర్లు, పట్టణాధ్యక్షుడు పోచం భిక్షపతి, లక్ష్మీనర్సయ్య, రాములు, కన్నయ్య, గోవర్ధన్, యాదగిరి, ప్రసాద్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

● కేసరి యూత్ క్లబ్ అధ్యక్షుడు బాలనర్సయ్య

ఆలేరు : యువత క్రీడల్లో రాణించాలని కేసరి యూత్ క్లబ్ అధ్యక్షుడు రేగు బాలనర్సయ్య సూచించారు. సోమవారం ఆలేరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మూడో బాలబాలికల సబ్ జూనియర్ కబడ్డీ సెలక్షన్స్ జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెలక్షన్స్‌కు యువతీ, యువకులు 285 మంది వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూల నాగయ్య, యువతీ, యువకులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థి అదృశ్యం

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 12 : ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహానికి చెందిన విద్యార్థి అదృశ్యమైన సంఘటన ఆదివారం అర్ధరాత్రి భూదాన్‌పోచంపల్లిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురానికి చెందిన ఈడుదుల బుచ్చయ్య-సునీత దంపతులు గ్రామంలో కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు మనిచరణ్ పోచంపల్లిలోని టీఎస్ మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతూ స్థానిక ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో ఉంటున్నాడు. రాత్రి 10 గంటల సమయంలో మనిచరణ్ విరేచనాలు అవుతున్నాయని చెప్పి బాత్రూమ్‌కు వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. ఈ విషయాన్ని తోటి విద్యార్థులు వంటమనిషికి చెప్పగా, ఆమె వార్డెన్‌కు చెప్పింది. దాంతో వార్డెన్ మనిచరణ్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ బాబు ఇంటికి వచ్చాడా? అని అడిగింది. బాబు మీ వద్దే ఉంచుకొని మాకు ఫోన్ చేస్తున్నారేంటని తల్లిదండ్రులు ప్రశ్నించారు. వెంటనే వారు హాస్టల్‌కు వచ్చారు. బంధువులకు ఫోన్ చేశారు. అయినా విద్యార్థి ఆచూకీ లభించలేదు. విద్యార్థి మిస్సింగ్ విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్లో వార్డెన్ కరుణశ్రీ ఫిర్యాదు చేసింది. సాయంత్రం 4 గంటలకు హయత్‌నగర్‌లో విద్యార్థి ఆచూకీ లభ్యమైంది. కాగా, హాస్టల్ వార్డెన్ స్థానికంగా ఉండటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

చౌటుప్పల్ ఆర్డీఓగా శేఖర్‌రెడ్డి

చౌటుప్పల్, ఫిబ్రవరి 12 : చౌటుప్పల్ నూతన ఆర్డీఓగా శేఖర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎస్‌డీసీ యూనిట్-1యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ నుంచి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

బస్వాపూర్‌లో బెల్ట్ షాపులను నిషేధించాలి

● తాసీల్దార్, ఎక్సైజ్ అధికారులకు యువజన సంఘాల వినతి

తాసీల్దార్ అంజిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న యువజన సంఘాల నాయకులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 12 : మండలంలోని బస్వాపూర్‌లో బెల్ట్ షాపులను నిషేధించాలని గ్రామ ప్రత్యేకాధికారి, తాసీల్దార్ అంజిరెడ్డి, ఎక్సైజ్ అధికారులు, రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్‌కు సోమవారం యువజన సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామంలో మద్యానికి బానిసలైన యువకులు నెలలోనే ఐదుగురు చనిపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అలాగే మద్యం సేవించిన యువకులు మత్తులో గొడవలు చేస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే బెల్ట్ షాపులను నిషేధించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని, లేని పక్షంలో గ్రామస్తులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిక్కుల వెంకటేశం, కస్తూరి పాండు, మచ్చ తిరుపతి, రాసాల నర్సింహ, మాటూరి అనిల్‌కుమార్, దూసరి మహేశ్, అన్నంపట్ల బాలస్వామి, కడారి చందు, మచ్చ జహంగీర్, చిక్క కిరణ్, కస్తూరి నరేశ్ పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల నిరసన

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న సర్వేల్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు

సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి12 : రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయ ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టిన తరువాతనే నూతన నియామకాలు చేపట్టాలని మండలంలోని సర్వేల్, నారాయణపురంలోని గిరిజన గురుకుల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ గురుకులాల్లో 20 వేల మంది పని చేస్తున్నారని, వారి సమస్యలను పరిష్కారించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, ఉపాధ్యాయులు రామారావు, గీత, రజిత, స్వాతి, శ్రీనివాస్, శ్రీరాములు, రమేశ్, పాల్గొన్నారు.

గ్రూప్-4 ఫలితాల్లో మోత్కూరు వాసికి జిల్లా మొదటి ర్యాంకు

సాయికృష్ణారెడ్డి

మోత్కూరు, ఫిబ్రవరి 12 : ఇటీవల విడుదలైన గ్రూప్-4 ఫలితాల్లో మోత్కూరుకు చెందిన గుర్రం సాయికృష్ణారెడ్డి జిల్లా మొదటి ర్యాంక్ సాధించాడు. 210.310 మార్కులు సాధించి జిల్లా మొదటి ర్యాంక్, స్టేట్ 20వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. సాయికృష్ణ అనురాగ్ యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేశాడు. గ్రూప్-1 లక్ష్యంగా చదువుతున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 12 : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన పట్టణంలోని రాయగిరి సమీపంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన బూర్గుల రాంరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం సోమవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు కారులో, మృతురాలు నవనీత(28), ఆమె మరిది సుధాకర్‌రెడ్డి బైక్‌పై ఉప్పల్‌కు వెళ్తుండగా రాయగిరి హైస్కూల్ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపు తప్పి కిందపడిపోయారు. ప్రమాదంలో వెనుక కూర్చున్న నవనీత తలకు తీవ్ర గాయమైంది. ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. భర్త రాంరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

యాదవులంతా ఐక్యంగా ముందుకెళ్లాలి

● అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్‌యాదవ్

సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్ యాదవ్

చౌటుప్పల్, ఫిబ్రవరి 12 : యాదవులంతా ఐక్యంగా ముందుకెళ్లాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల రాజేందర్ యాదవ్ అన్నారు. సోమవారం చౌటుప్పల్‌లో సంఘం డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవుల అభ్యున్నతి, అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడాలన్నారు. వెనుకబడిన యాదవులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుండెబోయిన ఆయోధ్యయాదవ్, ముక్కాముల దుర్గయ్యయాదవ్, చిలుకల శ్రీనివాస్‌యాదవ్, చినుకని మల్లేశ్‌యాదవ్, గుండెబోయిన వెంకటేశ్‌యాదవ్, నల్ల పర్వతాలుయాదవ్, కొత్త పర్వతాలుయాదవ్, జాల మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

● రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీశైలం

జ్ఞానప్రకాశ్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

బొమ్మలరామారం, ఫిబ్రవరి 12 : బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ర్యాకల శ్రీశైలం కోరారు. సమ్మెకు సంబంధించిన నోటీసును మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ జ్ఞానప్రకాశ్‌రెడ్డికి ఆయన ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం మండల నాయకులు యాదగిరి, మైసయ్య, సాయిలు, కార్మికులు బాలయ్య, బాలరాజు, సత్తయ్య, యాదగిరి, నర్సమ్మ, లక్ష్మి, మల్లమ్మ పాల్గొన్నారు.

భువనగిరి, కలెక్టరేట్ : మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ బంద్ సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. సోమారం సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అనాజిపురంలో సమ్మె కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లేశం, కిషన్, బొల్లేపల్లి కుమార్, ప్రేమలత, వెంకటేశ్, బాలయ్య, కృష్ణ, పరమేశ్, వెంకటేశం, అఫ్జల్, శివ, లక్ష్మి, రాజు, మల్లేశం, వెంకటస్వామి పాల్గొన్నారు.

బాలికలు నవసమాజ నిర్దేశకులు కావాలి

● విశ్రాంత ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్

సెమినార్‌లో మాట్లాడుతున్న కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 12 : బాలికలు నవసమాజ నిర్దేశకులు కావాలని కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని తూప్రాన్‌పేట సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, ఐసీఎస్ఎస్ఆర్ ఆధ్వర్యంలో బేటీ బచాఓ బేటీ పడాఓ సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. బాలికలు అన్ని రంగాల్లో రాణించేందుకు విద్య ఎంతగానో ఉపయోగపడ